# ఎగ్జిట్‌పోల్స్‌లో ఊగిసలాట

- గందరగోళానికి తెరలేపిన సర్వేల ఫలితాలు
- కొన్ని బీఆర్‌ఎస్‌కు, మరికొన్ని కాంగ్రెస్‌కు అనుకూలంగా ఫలితాలు విడుదల
- బీఆర్‌ఎస్‌కు క్లియర్ మెజార్టీ ఇచ్చిన కొన్ని సంస్థలు
- కాంగ్రెస్‌కు మ్యాజిక్ ఫిగర్‌పై సర్వేల ఊగిసలాట
- 2018 ఎన్నికల్లోనూ జనం నాడి పట్టని సర్వేలు
- బీఆర్‌ఎస్ విజయాన్ని అంచనా వేయటంలో విఫలం
- ఈసారీ అదే రకమైన ఫలితాలు వస్తాయంటున్న నిపుణులు



సిరిసిల్లలోని అంబేద్కర్‌నగర్ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను అంచనా వేయడంలో సర్వే సంస్థలు ఊగిసలాటలో ఉన్నాయి. కొన్ని సర్వే సంస్థలు బీఆర్‌ఎస్‌కు భారీ మెజార్టీ వస్తుందని చెప్పగా, మరికొన్ని సంస్థలు స్వల్ప ఆధిక్యంతో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఫలితాలిచ్చాయి. గురువారం రాత్రి సుమారు 18 సర్వే సంస్థలు ఎగ్జిట్‌పోల్స్‌ను వెల్లడించగా, ఇందులో 10 సంస్థలు బీఆర్‌ఎస్‌కు, 8 సంస్థలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఫలితాలు ఇచ్చాయి. మెజార్టీ సర్వే సంస్థలు బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపడం గమనార్హం. సర్వే సంస్థలు బీఆర్‌ఎస్‌కు అత్యధికంగా 78 సీట్లు వస్తాయని వెల్లడించగా, కాంగ్రెస్‌కు 68 సీట్లు వస్తాయని పేర్కొన్నాయి. బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఇచ్చిన సర్వే సంస్థలు.. ఆ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ 60కి పైగానే సీట్లు వస్తాయని తెలిపాయి. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఫలితాలు ఇచ్చిన సర్వే సంస్థలు మాత్రం... ఆ పార్టీకి మ్యాజిక్ ఫిగర్‌కు అటూ ఇటుగా సీట్లు ఇచ్చాయి. 2018 ఎన్నికల్లోనూ అనేక సర్వే సంస్థలు ఇలాంటి ఫలితాలనే ప్రకటించాయి. కానీ, ఆ సర్వేల ఊహకు కూడా అందనంతగా బీఆర్‌ఎస్ 88 స్థానాల్లో జయకేతనం ఎగురవేసి బంపర్ మెజార్టీ సాధించింది.

### గత ఎన్నికల్లోనూ గందరగోళమే

అసెంబ్లీ ఎన్నికలపై గురువారం సాయంత్రం విడుదలైన ఎగ్జిట్‌పోల్స్ ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉన్నాయి. ప్రజలను గందరగోళపర్చటంతోపాటు ఆ సర్వేలు నిర్వహించిన సంస్థలు కూడా తీవ్ర గందరగోళంలో పడినట్టు ఆ లెక్కలను బట్టి అర్థమవుతున్నది. 2018 ఎన్నికల పోలింగ్ తర్వాత కూడా సరిగ్గా ఇలాంటి గందరగోళమే కనిపించింది. ఎగ్జిట్‌పోల్స్ ఫలితాల పేరుతో పలు సర్వే సంస్థలు తీవ్ర గందరగోళానికి తెరలేపాయి. కొన్ని సంస్థలు అధికారం బీఆర్‌ఎస్‌దేనని, మరికొన్ని సంస్థలు కాంగ్రెస్‌దని, ఇంకా కొన్ని సంస్థలు హంగ్ అంటూ లెక్కలు చెప్పాయి. మెజార్టీ సంస్థలు వాస్తవ ఫలితాలను అంచనా వేయడంలో విఫలమయ్యాయి. ఏ సంస్థ అంచనా వేయని విధంగా ఫలితాలు వెల్లడయ్యాయి. బీఆర్‌ఎస్ పార్టీ ఆ ఎన్నికల్లో విజయ దుందుభి మోగించింది. ఏకంగా 88 స్థానాల్లో విజయకేతనం ఎగరేసింది. ఈ ఎన్నికల్లోనూ గతంలో మాదిరిగానే ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు మళ్లీ తలకిందులు కావడం ఖాయమనే అభిప్రాయాలు రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతున్నాయి.

### బీఆర్‌ఎస్ మెజార్టీని అంచనా వేయని సర్వేలు

గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 88 స్థానాలు వస్తాయని రెండు మూడు సంస్థలు మినహా మిగతావేవీ అంచనా వేయలేకపోయాయి. గతంలో సర్వే సంస్థలు బీఆర్‌ఎస్‌కు అత్యధికంగా 70 స్థానాలు ఇవ్వగా కాంగ్రెస్‌కు 75 స్థానాలు ఇచ్చాయి. ఇప్పుడు కూడా బీఆర్‌ఎస్‌కు 72 సీట్లు ఇవ్వగా కాంగ్రెస్‌కు 68 సీట్లు ఇచ్చాయి. మరీ దారుణంగా ఫ్లాష్‌టీం సర్వే అయితే గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 25 నుంచి 45 స్థానాలు వస్తాయని చెప్పగా కాంగ్రెస్‌కు 55 నుంచి 75 స్థానాలు వస్తాయని అంచనా వేసింది. వాస్తవ ఫలితాలు మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధంగా బీఆర్‌ఎస్‌కు 88 సీట్లు రాగా కాంగ్రెస్ 21 స్థానాలకే పరిమితమైంది. దీంతో ఫ్లాష్‌టీం సర్వే పూర్తిగా తలకిందులైంది. ఇక జన్ కీ బాత్ సర్వే అంచనాలు కూడా తలకిందులయ్యాయి. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 50 నుంచి 65 సీట్లు, కాంగ్రెస్‌కు 38 నుంచి 52 సీట్లు వస్తాయని పేర్కొన్నది. కానీ ఆ సర్వే ఫలితాలు కూడా వాస్తవ ఫలితాల ముందు తేలిపోయాయి. న్యూస్‌ఎక్స్–నేత సర్వే సంస్థ గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 57 స్థానాలు ఇవ్వగా, కాంగ్రెస్‌కు 46 స్థానాలు ఇచ్చింది. సీ–ఓటర్ సర్వే బీఆర్‌ఎస్‌కు 48–60 సీట్లు ఇవ్వగా, కాంగ్రెస్ 47–59 సీట్లు గెలుస్తుందని తెలిపింది. కానీ ఈ సంస్థల సర్వేలేవీ నిజం కాలేదు. ఏ సర్వే సంస్థ కూడా ఫలితాలను సరిగ్గా అంచనా వేయలేకపోయింది. మరీ ముఖ్యంగా బీఆర్‌ఎస్ గెలిచే స్థానాలను అంచనా వేయడంలో మెజార్టీ సంస్థలు విఫలమయ్యాయి.

### 2018 ఎగ్జిట్‌పోల్స్ సర్వేల ఫలితాలు

| సర్వే సంస్థ | టీఆర్‌ఎస్ | కాంగ్రెస్ కూటమి |
|---|---|---|
| సీఓటర్ | 48-60 | 47-59 |
| ఎన్డీటీవీ | 64 | 41 |
| ఇండియా టీవీ | 62-70 | 32-38 |
| న్యూస్‌ఎక్స్ -నేత | 57 | 46 |
| టైమ్స్‌నౌ-సీఎన్‌ఎక్స్ | 66 | 37 |
| న్యూస్ నేషన్ | 53-57 | 51-55 |
| రిపబ్లిక్-జన్ కీ బాత్ | 50-65 | 38-52 |
| ఫ్లాష్ టీం | 25-45 | 55-75 |
| ఎన్నికల ఫలితాలు | 88 | 21 |

### 2023 ఎన్నికల ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు

| సర్వే సంస్థ | బీఆర్‌ఎస్ | కాంగ్రెస్ | బీజేపీ | ఎంఐఎం | ఇతరులు |
|---|---|---|---|---|---|
| సీఎస్‌డీపీ | 78 | 28 | 05 | 07 | 01 |
| సీపీఎస్ | 72+/-6 | 36+/-5 | 1-3 | -- | 07-09 |
| సునీల్‌వీర్ | 68-72 | 28 | 10-11 | 06 | 00 |
| పల్స్‌టుడే | 69-71 | 37-38 | 3-5 | 06 | 02 |
| థర్డ్ విజన్ | 61-68 | 34-40 | 3-5 | 5-7 | 0-1 |
| శ్రీ ఆత్మసాక్షి | 58-63 | 48-51 | 07-08 | 06-07 | 02 |
| ప్రీవర్ | 55-60 | 35-40 | 8-10 | -- | 09 |
| సీఎన్‌ఎన్ | 56 | 48 | 10 | 05 | -- |
| బ్యాటిల్ గ్రౌండ్ తెలంగాణ | 58-63 | 48-51 | 7-8 | 6-7 | 1-2 |
| ఆరా | 41-49 | 58-67 | 05-07 | -- | 07-09 |
| రాజ్‌నీతి | 45(+/-5) | 56(+/-5) | 10(+/-2) | 07 | 01 |
| పోల్ స్ట్రాట్ | 48-58 | 49-59 | 05-10 | 06-08 | -- |
| సీ-ప్యాక్ | 41 | 65 | 04 | 05 | 04 |
| ఎన్డీటీవీ | 48-64 | 40-55 | 7-13 | 4-7 | -- |
| రేస్ | 48(+/-3) | 62(+/-5) | 3(+/-2) | 6(+/-1) | 00 |
| పీటీఎస్ | 35-40 | 65-68 | 7-10 | 6-7 | 1-2 |
| పొలిటికల్ లేబొరేటరీ | 36-38 | 58-61 | 10-12 | 6-7 | 0-1 |
| క్యూ మెగా | 55-60 | 45-50 | 2-5 | 5-7 | 00 |

### సర్వేలు మళ్లీ తలకిందులేనా?

ఈ ఎన్నికల్లో గతంలో మాదిరిగానే సర్వే సంస్థల ఎగ్జిట్‌పోల్ ఫలితాలు తలకిందులవడం ఖాయమనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతున్నది. గతంతో పోల్చితే ఈ ఎన్నికలు పూర్తి భిన్నంగా ఉన్నాయని, గత ఎన్నికల ఫలితాలనే అంచనా వేయలేని సంస్థలు ఈ ఎన్నికల ఫలితాలను సరిగ్గా అంచనా వేస్తాయనే నమ్మకం లేదంటున్నారు. మెజార్టీ సంస్థల సర్వే తీరుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఓ పద్ధతి, ఫార్ములా లేకుండా సర్వేలు చేస్తున్నాయని, ఇది హడావిడి చేయడానికే తప్ప మరేమీ లేదని పేర్కొన్నారు. తెలంగాణ ఓటర్ నాడిని సర్వే సంస్థలు పట్ట లేకపోతున్నాయని అంటున్నారు. ఓటర్లు తమ అభిప్రాయాలేవీ సర్వే సంస్థలకు వెల్లడించడం లేదని, అలాంటప్పుడు సరైన అంచనాలు రావడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈసారి కూడా గతంలో మాదిరిగానే ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు తలకిందులవుతాయని చెప్తున్నారు.

## మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం

### సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం

- ఓటర్లంతా సంక్షేమం, అభివృద్ధివైపే
- క్యూ మెగా ఎగ్జిట్ పోల్ వెల్లడి

ఖైరతాబాద్, నవంబర్ 30: అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి బీఆర్‌ఎస్ విజయ బావుటా ఎగురవేస్తుందని క్యూ మెగా ఎగ్జిట్ పోల్స్ ప్రకటించింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో ఖాదర్ ఖాన్ పఠాన్ సర్వే వివరాలను వెల్లడించారు. బీఆర్‌ఎస్‌కు 55 నుంచి 60 సీట్లు, కాంగ్రెస్ 45 నుంచి 50 సీట్లు వస్తాయని తెలిపారు. బీజేపీకి 2 నుంచి 5, ఎంఐఎంకు 5 నుంచి 7 సీట్లు వచ్చే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఓట్ షేర్ బీఆర్‌ఎస్‌కు 43 శాతం రావచ్చని అంచనా వేశారు. 30 ఏండ్ల లోపువారు 38 శాతం, 30 నుంచి 40 ఏండ్లవారు 40 శాతం, 40 నుంచి 50 ఏండ్ల వయస్సు గలవారు 48 శాతం, 50 నుంచి 60 ఏండ్లున్నవారు 50 శాతం, 60 ఏండ్లు పైబడ్డవారు 51 శాతం మంది బీఆర్‌ఎస్‌వైపు మొగ్గారని చెప్పారు. బీఆర్‌ఎస్ మూడోసారి విజయం సాధించి కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని తెలిపారు. ప్రజలు సంక్షేమం వైపు మొగ్గు చూపారని, ప్రజా ప్రతినిధులకంటే పార్టీ, సీఎం కేసీఆర్ నాయకత్వంపై ఉన్న నమ్మకంతో ఓట్లు వేశారని చెప్పారు. 119 నియోజకవర్గాల్లో తమ బృందం 10,22,500 మంది నుంచి వివరాలు సేకరించి సర్వేను రూపొందించామని వెల్లడించారు.

## ఇంటెలిజెన్స్ పేరిట కాంగ్రెస్ ఫేక్ సర్వే

- ఐబీ పేరును తప్పుగా వాడితేచర్యలే: ఏడీజీ అనిల్

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ ): అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించిన కాంగ్రెస్ పార్టీ దొంగ సర్వేలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నది. ఈసారి ఏకంగా తెలంగాణ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ)ను బద్నాం చేసేందుకు కుట్ర చేశారు. ప్రజల్లో విశ్వాసాన్ని పెంచేందుకు ఐబీ పేరిట ఫేక్ సర్వే రిపోర్టును బయట పెట్టారు. నవంబర్ 23న ఈ సర్వే ఇంటెలిజెన్స్ అధికారులు నిర్వహించినట్టు, అందులో బీఆర్‌ఎస్‌కు తక్కువ సీట్లు, కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు వచ్చినట్టు ఎన్నికలు ముగిసిన వెంటనే తమ అనుకూల మీడియాల్లో, సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టించారు. ఈ విషయమైన ఇంటెలిజెన్స్ ఏడీజీ అనిల్ కుమార్‌ను 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా ఆయన అవన్నీ బోగస్ సర్వేలని తేల్చారు. ఇంటెలిజెన్స్ పేరిట తాము ఏ సర్వే ఇవ్వలేదని.. తమ పేరిట ఎవరైనా బోగస్ రిపోర్టులు తయారుచేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రా ఏజెన్సీ లోగో పెట్టి ఇట్లాంటి మోసాలకు తెగబడితే.. ఉపేక్షించబోమని చెప్పారు.



## 7 అడుగుల కురులు గిన్నిస్ రికార్డు!

న్యూఢిల్లీ, నవంబర్ 30: ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ మహిళ అత్యంత పొడవైన కురులతో గిన్నిస్ రికార్డు కొట్టింది. 46 ఏండ్ల స్మితా శ్రీవాస్తవ 236.22 సెం.మీ (7 అడుగుల 9 అంగుళాలు) పొడవైన జుట్టుతో ఈ అరుదైన రికార్డును సాధించింది. తన తల్లి స్ఫూర్తితో 14 ఏండ్ల నుంచి పొడవైన జుట్టును పెంచడానికి ప్రయత్నాలు ప్రారంభించినట్టు ఆమె తెలిపారు. చిన్నప్పటి నుంచి పొడవైన, అందమైన కురులున్న బాలీవుడ్ హీరోయిన్లను అనుకరించే దానినని, సాధారణంగా వారానికి రెండుసార్లు తలస్నానం చేస్తానని, తలస్నానం, కురులు ఆరబెట్టడం, స్టైలింగ్ తదితర ప్రక్రియలకు సుమారు మూడు గంటల సమయం పడుతుందని తెలిపింది.



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ఆందోళనకారులను చెదరగొడుతున్న పోలీసులు

# కాంగ్రెస్ దౌర్జన్యకాండ

- బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలపై దాడులు
- రాళ్లు విసరడంతో ఉద్రిక్తత
- పలువురు పోలీసులకు గాయాలు
- పలుచోట్ల పోలీసుల లాఠీచార్జి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: తెలంగాణ శాసనసభకు జరిగిన పోలింగ్ మొత్తంగా ప్రశాంతంగా జరిగినా కొన్నిచోట్ల మాత్రం చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయి. చాలాచోట్ల కాంగ్రెస్ పార్టీ రౌడీయిజానికి పాల్పడింది. అధికార పార్టీ అభ్యర్థులపై కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. వాహనాలను ధ్వంసం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద నానా రభస చేశారు. కొన్ని చోట్ల రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనల్లో కొందరు పోలీసులు కూడా గాయపడ్డారు. పోలింగ్ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు యథేచ్ఛగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో పోలింగ్ సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. స్థానిక బీఎంఎస్ కార్యాలయం సమీపంలోని 90వ పోలింగ్ కేంద్రంలో బీఆర్‌ఎస్, బీజేపీ, బీఎస్పీ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు చెప్పులు, రాళ్లు విసురుకున్నారు. వారిని చెదరగొట్టే క్రమంలో కరీంనగర్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌ఐ గంగన్న, కానిస్టేబుళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం మేడిపల్లిలో పోలింగ్ సందర్భంగా బీజేపీ, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోఖానాపూర్ నియోజకవర్గంలోని ఎంగ్లాపూర్, బెల్లంపల్లి నియోజకవర్గంలోని వరిపేట వాసులు పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. అధికారులు వచ్చి సర్ది చెప్పడంతో ఈ రెండు గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్లు వేశారు. బోథ్ నియోజకవర్గం భీంపూర్ మండలం గొల్లగఢ్‌తాంసి గ్రామస్థులు కూడా పోలింగ్‌ను బహిష్కరించారు.

### డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి కారుపై దాడి

యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాకలో డీసీసీబీ చైర్మన్, నియోజకవర్గ పోలింగ్ ఏజెంట్ గొంగిడి మహేందర్‌రెడ్డి కారుపై కాంగ్రెస్ కార్యకర్తలు వెంబడించి రాళ్లతో దాడి చేశారు. హనుమకొండ రాంనగర్‌లోని కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ కార్యాలయంపై రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఉదయభాస్కర్ దాడి చేసి ఆయన డ్రైవర్‌ను చితకబాదారు. వరంగల్‌లోని పెరుకవాడలో సాయంత్రం 5 గంటలకు ఒక్కసారిగా ఓటు వేయడానికి ప్రజలు తరలి రావడంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. జనగామలో కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం ఒక్కటై బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాష్టీకానికి పాల్పడ్డాయి. ప్రెస్టన్ స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. జనగామ రైల్వేస్టేషన్ సమీపంలోని పోలింగ్‌బూత్ వద్ద కూడా కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకులు ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు ప్రయత్నించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలను చొక్కా పట్టుకొని ఆవరణలోకి లాక్కెళ్లి పిడిగుద్దులు కురిపించారు. ఆ తర్వాత కూడా జనగామలో ఉద్రిక్తత నెలకొంది. నర్సంపేట రోడ్డులో బీఆర్‌ఎస్ అభ్యర్థి నన్నపునేని నరేందర్, కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖ వాహనాలు ఎదురుపడ్డాయి. కారుదిగి వచ్చిన సురేఖ.. నరేందర్‌ను అంతుచూస్తానని బెదిరించడంతో ఉద్రిక్త వాతావరణ ఏర్పడింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడిపై కత్తితో దాడి చేశారు. అచ్చంపేటలో బీఆర్‌ఎస్ కార్యకర్తల తలలు పగులగొట్టారు. మక్తల్ నియోజకవర్గంలోని వర్కూరులో బీఆర్‌ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై దాడికి యత్నించారు.

### ఎన్నికల విధుల్లో ఉద్యోగి మృతి

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగి ఒకరు మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో చోటు చేసుకుంది. బుధవారం రాత్రి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని 248 నెంబర్ పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధుల కోసం వచ్చిన సుధాకర్(48) అర్ధ రాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఛాతీనొప్పితో బాధపడగా వెంటనే ఆయనను పటాన్‌చెరు ఏరియా దవాఖానకు తరలించారు. అప్పటికే ఆయన గుండెపోటుతో మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు.ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన చంద్రగిరి రాజన్న(65) స్థానిక బాలికల పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి క్యూలో నిలబడ్డాడు. అకస్మాత్తుగా కింద పడిపోవడంతో స్థానికులు, సిబ్బంది చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మావల గ్రామానికి చెందిన తోకల గంగమ్మ(76) ఓటు వేయడానికి మావల ప్రభుత్వ పాఠశాలకు రాగా అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చింది. అక్కడ ఉన్న సిబ్బంది చికిత్స కోసం రిమ్స్‌కు తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

### పుట్టెడు దుఃఖంలోనూ ఓటు

కన్నతండ్రి మృతి చెందినప్పటికీ బాధ్యతను విస్మరించకుండా ఓటు హక్కును వినియోగించుకున్న ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని ఆవంచ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జక్కుల రాములు గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. అయినప్పటికీ రాములు కుమారుడు ప్రశాంత్, ఆయన సోదరుడు శ్రీనివాస పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# సాగర్ డ్యామ్‌పై ఆంధ్రా పోలీసుల రగడ

- 500 మంది పోలీసులతో వచ్చిన అధికారులు
- 13వ గేటు వరకు ఆక్రమించి బారికేడ్లు, ముళ్లకంచె ఏర్పాటు
- అడ్డుకున్న ఎస్పీఎఫ్ సిబ్బందిపై ఏపీ పోలీసుల దాడి
- డ్యామ్ సీసీ కెమెరాలు, సిబ్బంది ఫోన్లు ధ్వంసం
- మధ్యాహ్నం అక్రమంగా కుడికాల్వకు నీటి విడుదల
- డ్యాంలో సగ భాగం మాదేనంటూ వితండవాదం



నాగార్జునసాగర్ డ్యామ్ 13వ గేట్ వద్ద బారికేడ్లు, ముళ్ల కంచె ఏర్పాటు చేసి రోడ్డు మార్గాన్ని మూసి వేసిన ఆంధ్రా పోలీసులు

నందికొండ, నవంబర్ 30: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వరప్రదాయిని అయిన నాగార్జునసాగర్ డ్యామ్‌పై బుధవారం రాత్రి నుంచి ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. ఏపీ ఇరిగేషన్ అధికారులు సుమారు 500 మంది పోలీసులతో బుధవారం అర్ధరాత్రి ఆంధ్రా ప్రాంతం వైపు ఉన్న ఎంట్రెన్స్ నుంచి డ్యామ్‌పైకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బంది వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆంధ్రా పోలీసులు డ్యామ్ సెక్యూరిటీ గేట్‌పై నుంచి దూకి, గేట్ మోటర్‌ను ధ్వంసం చేసి గేట్‌ను తెరుచుకొని లోపలికి చొరబడ్డారు. వారిని నియంత్రిస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బందిపై దాడిచేశారు. డ్యామ్ సీసీ కెమెరాలు, ఎస్పీఎఫ్ సిబ్బంది ఫోన్లను ధ్వంసం చేశారు. డ్యామ్ 13వ గేట్ వరకు డ్యామ్ తమదని, అక్కడ ముళ్ల కంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేసి రోడ్డును మూసి వేశారు. దాంతో రాకపోకలు నిలిచిపోయాయి. డ్యామ్‌పై విధులు నిర్వహించే సిబ్బంది 13వ గేట్ దాటి అటువైపు ఉన్న తెలంగాణ కంట్రోల్ రూమ్ వైపు వెళ్లలేకపోయారు. తెలంగాణ పోలీస్ అధికారులు వచ్చి పరిస్థితిని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు డ్యామ్ పైన ఇదే పరిస్థితి నెలకొన్నది. కాగా డ్యామ్ నిర్వహణ అంతా తెలంగాణ ప్రభుత్వం చేపడుతుంది. ఆంధ్రా సర్కారుకు ఆ బాధ్యత లేదు. కృష్ణా రివర్ బోర్డు సూచించిన నీటి వాటాల ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు డ్యామ్‌లోని నీటిని వినియోగించుకుంటాయి. ఈ నీటి వినియోగం విషయంలో పలుమార్లు ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య వివాదాలు చోటుచేసుకున్నాయి.

### కుడికాల్వకు అక్రమంగా నీటి విడుదల

డ్యామ్ 13వ గేట్ వరకు తమదని ఏపీ ఇరిగేషన్ అధికారులు అక్కడ ముళ్ల కంచె, బారికేడ్లు ఏర్పాటు చేసి రోడ్డు మూసివేశారు. గురువారం మధ్యాహ్నం జల విద్యుత్తు కేంద్రం ద్వారా కుడి కాల్వకు నీటి విడుదలను చేసుకున్నారు. నీటి విడుదల, డ్యామ్ పైన నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులను ఎన్నెస్పీ అధికారులు ఉన్నతాధికారులకు, కృష్ణా రివర్ బోర్డుకు ఫిర్యాదు చేశారు. ఉద్రిక్తతను తగ్గించడానికి తెలంగాణ అధికారులు డ్యామ్ వద్ద ప్రత్యేక బలగాలను మోహరించారు. ఏ క్షణంలోనైనా ఏపీ అధికారులు, పోలీసు బలగాలను తిప్పి పంపడానికి ప్రయత్నిస్తున్నారు.

# సాగర్ కంట్రోల్‌ను తెలంగాణకు అప్పగించండి

- కేఆర్‌ఎంబీ వెంటనే జోక్యం చేసుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న వేళ నాగార్జునసాగర్ డ్యామ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యత్నించడాన్ని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఏపీది దుస్సాహసమైన చర్య అని మండిపడింది. గతంలోనూ ఇదే రీతిలో వ్యవహరించిందని ధ్వజమెత్తింది. అర్ధరాత్రి 100 మంది సాయుధ పోలీసులను దింపి డ్యామ్‌పై ముళ్ల కంచె ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. డ్యామ్ కంట్రోల్‌ను తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేఆర్‌ఎంబీ చైర్మన్, మెంబర్ సెక్రటరీకి ఫిర్యాదు చేసింది. 2014 నుంచి శ్రీశైలం డ్యాం ఏపీ ప్రభుత్వం ఆధీనంలో, నాగార్జునసాగర్ తెలంగాణ ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయని గుర్తుచేసింది. రెండు జలాశయాల్లో నీటి పంపిణీని కేఆర్‌ఎంబీ పర్యవేక్షిస్తున్నదని, రెండు జలాశయాల నిర్వహణ బాధ్యతలను కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు అప్పగించేందుకు ఇప్పటికే ఇరు రాష్ట్రాలు సూత్రప్రాయంగా అంగీకరించాయని గుర్తుచేసింది. ఇందుకు ఆపరేషన్ ప్రొటోకాల్ రూపొందించే దిశగా చర్చలు కొనసాగుతున్నాయని, అప్పటివరకు ప్రాజెక్టుల నిర్వహణపై యథాతథస్థితిని కొనసాగించాల్సి ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. అయినప్పటికీ ఏపీ ప్రభుత్వం గతంలో కూడా నాగార్జునసాగర్ డ్యామ్‌ను సైతం ఆక్రమించడానికి యత్నించిందని గుర్తుచేసింది. తాజాగా తెలంగాణ ఎన్నికల్లో నిమగ్నమై ఉండగా, ఇదే అదునుగా బుధవారం అర్ధరాత్రి 100 మంది సాయుధ పోలీసులను దింపి డ్యామ్‌ను అక్రమించేందుకు యత్నించిందని, 13వ గేట్ వద్ద ముళ్ల కంచెను ఏర్పాటు చేసిందని, అక్కడ ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసిందని తెలిపింది. ఇది అప్రజాస్వామికమని పేర్కొన్నది. కుడి కాలువ ద్వారా అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నదని మండిపడింది. దీనిపై కేఆర్‌ఎంబీ వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేసింది. దౌర్జన్యపూరితంగా ఏపీ చేపట్టిన నీటి తరలింపును ఆపాలని, డ్యామ్ ఆక్రమణను తొలగించి పూర్వపుస్థితిని పునరుద్ధరించి మొత్తం డ్యామ్ కంట్రోల్‌ను తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించాలని విజ్ఞప్తి చేసింది. డ్యాంను కంట్రోల్‌లోకి తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నది. ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌కు సహకరించడానికి ఈఎన్సీ హరిరాం, చీఫ్ ఇంజినీర్ ధర్మతోపాటు పలువురు సీనియర్ ఇంజినీర్లను డ్యామ్ వద్దకు పంపించింది.